నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో గురువారం నుంచి పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభమవుతున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డు పరిధిలోని తాండూర్ మండలం రేపల్లేవాడ శివారులో ఉన్న రెండు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తారని తెలిపారు. నియోజకవర్గ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

20న శ్రీరామాయణ మహాయాగం

మంచిర్యాలటౌన్: అయోధ్య రామమందిర ప్రతిష్ట సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖ దంపతుల ఆధ్వర్యంలో ఈ నెల 20నుంచి 22వరకు మంచిర్యాలలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శ్రీరామాయణ మహాయాగం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. శోభాయాత్ర, మహాగణపతి పూజ, లలిత పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.0 /20.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగ మంచు కురుస్తుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

బస్టాండ్‌లో బాంబు స్క్వాడ్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న బాంబు, డాగ్‌స్క్వాడ్

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రమైన మంచిర్యాల బస్‌స్టేషన్‌లో బుధవారం బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికుల సామగ్రి, బ్యాగులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆకస్మాత్తుగా పోలీసుల బృందం బస్టాండ్ ప్రాంగణాన్ని జల్లెడ పట్టడంతో ఏం జరుగుతుందో తెలియక ప్రయాణికులు కలవరపడ్డారు. ఓ ఫేక్ ఫోన్‌కాల్ రావడంతోనే తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్టాండ్ రద్దీగా మారుతోంది. జేబుదొంగలు, చోరీలకు ఆస్కారం లేకుండా ఉండేలా ఎస్సైలు మహేందర్, జగదీశ్, మహేందర్ పరిశీలించారు. ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులకు సూచనలు చేశారు.

ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు



మాట్లాడుతున్న డీటీఓ కిష్టయ్య

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): ఫిబ్రవరి 14వరకు 35వ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి ఎల్.కిష్టయ్య తెలిపారు. బుధవారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీటీఓ మాట్లాడారు. ఈ ఏడాది రోడ్డు భద్రత మాసోత్సవాల్లో రవాణా శాఖతోపాటు పోలీస్, విద్యాశాఖ, ఎన్‌జీఓస్, వివిధ సంస్థలు, ఆటోమొబైల్స్ అసోసియేషన్లు, మోటార్ డ్రైవింగ్ స్కూల్స్, వివిధ వాహనాల డ్రైవర్లు, ఆరోగ్య శాఖ, రెడ్‌క్రాస్ సొసైటీ తదితర సంస్థలను భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం మాసోత్సవాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. వాహన చోదకులతోపాటు ప్రతీ ఒక్కరిని చైతన్యం చేయనున్నామని అన్నారు.

ముగిసిన ఆన్‌లైన్ నమోదు

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఈ నెల 11 నుంచి 17 వరకు 2,58,213 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలోని 16 మండలాలు, 7 మున్సిపాలిటీల నుంచి మొత్తం 2,90,873 దరఖాస్తులు రాగా ఇందులో ఐదు గ్యారంటీలవి కాకుండా కొత్త రేషన్‌కార్డులు, భూ సమస్యలు ఇతర సమస్యలపై తెల్లకాగితంపై రాసిచ్చిన 32,660 అర్జీలు ఉన్నాయి. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుతోపాటు మహాలక్ష్మి పథకం, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు గ్యాస్ కనెక్షన్, పట్టాపాస్‌బుక్, ఉపాధి కూలీ జాబ్‌కార్డు, కరెంట్ మీటర్ కనెక్షన్, సదరం సర్టిఫికెట్ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోగా వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దరఖాస్తు ఫారానికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా, తెల్లకాగితాలపై రాసిచ్చిన వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. ప్రభుత్వం విధించిన గడువులోగా 500 మందికి పైగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆపరేటర్లు ఏడు రోజుల వ్యవధిలో రాత్రీపగలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

నిర్ణీత గడువులోగా రేషన్ సరఫరా చేయాలి



ఇంచార్జి శంకర్‌కు డీలర్ల వినతిపత్రం

నస్పూర్: జిల్లాలోని రేషన్ పంపిణీ దుకాణాలకు నిర్ణీత గడువులోగా రేషన్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అంకం మనోజ్ అన్నారు. బుధవారం ఆయన పలువురు రేషన్ డీలర్లతో కలిసి పట్టణంలోని తీగల్‌పహాడ్ ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి శంకర్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా సరఫరా చేసే ప్రతీ ఒక్క బియ్యం బస్తా 50 కిలోలు ఉండేలా తూకం వేసి రేషన్ దుకాణాలకు సరఫరా చేయాలని కోరారు. డీలర్ల నుంచి బయోమెట్రిక్ తీసుకున్న తర్వాత రెండు, మూడు రోజుల్లో బియ్యం సరఫరా చేయాలని అన్నారు. ప్రతీ మండల రేషన్ డీలర్లకు ఒక నిర్ణీత సమయం కేటాయించి బయోమెట్రిక్ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మండల ప్రెసిడెంట్ సల్ల రవికుమార్, డీలర్లు బూర్ల మహేందర్, అంకం తిరుపతి, బానేష్, ఆరుముళ్ల పోశం, తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జెండా ఊపి పరుగు పందెం ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఆరంభం అదిరే..

సాక్షి,ఆదిలాబాద్: క్రీడా సంబురం మొదలైంది. ఉట్నూర్ వేదికగా ఇంటర్ సొసైటీ లీగ్ (ఐఎస్ఎల్) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐటీడీఏలోని కుమురంభీమ్ ప్రాంగణ మైదానాల్లో మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. రాష్ట్రంలోని ఏడు సొసైటీలకు చెందిన క్రీడాకారులు ఇందులో పాల్గొంటున్నారు. ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్ పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు సొసైటీల వారీగా మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. 13 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుండగా.. 3,500 మంది క్రీడాకారులు, కోచ్‌లు, రెఫరీలు హాజరయ్యారు.

- వివరాలు 10లో▸

ఒకే పోస్టులో ఇద్దరు !

- సమగ్ర శిక్ష అభియాన్ కో ఆర్డినేటర్‌గా ఇద్దరు టీచర్లు
- మంచిర్యాల జిల్లాలో జీతం.. ఆసిఫాబాద్‌లో విధులు
- పలుకుబడితో బడికి ఎగనామం
- విద్యాశాఖలో ఇంకా కొనసాగుతున్న డిప్యూటేషన్లు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: విద్యాశాఖలో డిప్యూటేషన్ల వ్యవహారం ఇంకా కొనసాగుతూనే ఉంది. విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించే ఉపాధ్యాయులు ఇతర విధుల్లో ఉండొద్దనే నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు. కుమురంభీం జిల్లా విద్యాశాఖలో ఓ టీచర్ మన ఊరు–మన బడి కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేకంగా డిప్యూటేషన్ తెచ్చుకుని పని చేస్తున్నారు. చిత్రంగా ఇక్కడ ఒకే పోస్టులో ఇద్దరు పని చేస్తున్నా అటు ఉన్నతాధికారులు ఇటు విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై పీఆర్టీయూ నుంచి కుమురంభీం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు సైతం వెళ్లింది. అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. వాస్తవానికి విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులను బోధనేతర విధుల్లో నియమించరాదు. పాలన సౌలభ్యం విద్యాశాఖకు సంబంధించిన పనుల పర్యవేక్షణ పేరుతో చాలామంది టీచర్లు ఇంకా అక్రమంగా ఆయా చోట్ల కొనసాగుతూనే ఉన్నా సంబంధిత శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ టీచర్లు బడికి వెళ్లకుండానే వేరే చోట్ల పని చేస్తూ ఉండిపోతున్నారు.

కోఆర్డినేటర్లుగా ఇద్దరు

మంచిర్యాల జిల్లాకు 317 జీవోలో బదిలీ అయిన ఓ టీచర్ ఇప్పటికీ కుమురంభీం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోనే కొనసాగుతున్నారు. తోటి ఉపాధ్యాయులకు భిన్నంగా జిల్లా ఉన్నతాధికారులతో మౌఖికంగా చెప్పించుకుని ఫిజిక్స్ బోధించే టీచర్ అక్కడే తిష్ట వేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బదిలీల్లో భాగంగా మొదట నెన్నెల మండలం ఆవడంకు వెళ్లారు. దూర భారమని చెప్పుకుని రెండు జిల్లాల ఉన్నతాధికారులతో చెప్పించుకుని ఇంకా అక్కడే కొనసాగుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే తమకు ఇంకా డిప్యూటేషన్ గడువు ఉందని చెప్పుకుంటున్నారని టీచర్లు ఆరోపిస్తున్నారు. కుమురంభీం జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ కోఆర్డినేటర్‌గా ఇప్పటికే ఒకరు పని చేస్తున్నారు. ఆయన స్థానంలో మరొకరు వచ్చారు. మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారని కారణంగా చూపిస్తూ ప్రస్తుతం ఇద్దరు ఒకే చోట పని చేస్తుండడం గమనార్హం. మరోవైపు మంచిర్యాల జిల్లాకు బదిలీ కావడంతో ఇక్కడి నుంచి జీతం తీసుకుంటూ అక్కడ విధులు నిర్వర్తిస్తుండడంపై టీచర్లు మండిపడుతున్నారు.

డిప్యూటేషన్ల పేరిట

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కొత్త జోన్ల ప్రకారం ఉద్యోగుల సర్దుబాటుకు గత బీఆర్ఎస్ సర్కారు రెండేళ్ల క్రితం 317జీవో తెచ్చింది. ఈ జీవో ప్రకారం ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయి. బదిలీల్లో కొందరికి అనుకున్న చోట్ల పోస్టింగ్ రాకపోగా, ఇతర జిల్లాలకు వెళ్లాల్సి రావడంతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. దీంతో వ్యతిరేకించారు. ఆందోళనలు జరిగాయి. చివరకు పోస్టింగ్‌లు జరిగిపోయాయి. ఈ జీవో ప్రకారం సర్దుబాటులో భాగంగా ఇంకా కొందరు జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో అక్రమంగా డిప్యూటేషన్లు తెచ్చుకుని కొనసాగుతున్నారని తోటి ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లాలోనూ ఓ టీచర్ డిప్యూటేషన్ పేరుతో బోధనకు దూరంగా ఉంటున్నారు. ఫారిన్ సర్వీస్ కింద ఐదేళ్లు చేయొచ్చని చెప్పుకుంటూ కొనసాగుతున్నారు. అవసరమైనప్పుడల్లా రాజకీయ, పలుకుబడి ఉన్న కొందరు టీచర్లు అనుకూలంగా ఉన్న చోట్ల పోస్టింగ్‌ల్లో ఉంటున్నారు. వీరే కాకుండా మరికొందరు టీచర్లు సింగిల్ టీచర్లు, ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతోనూ తమకు నచ్చిన చోటే విధులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి టీచర్లను తమ స్థానాలకు పంపించి, ఆయా చోట్ల విద్యార్థులకు పాఠాలు బోధించేలా చూడాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

నవోదయ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశం నిర్వహిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న నిర్వహించనున్న జవహర్ నవోదయ విద్యాలయ సమితి పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, సెంటర్ లెవల్ అబ్జర్వర్లతో పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 1,188 మంది హాజరు కానున్నారని తెలిపారు. మంచిర్యాల, లక్సెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, బెల్లంపల్లి మండల కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 10గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, హాల్‌టికెట్లను జవహర్ నవోదయ అధికారిక వైబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్లలో లక్సెట్టిపేట, మంచిర్యాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు పరీక్ష కేంద్రాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలికలుగా గుర్తించాలన్నారు. సమావేశంలో జవహర్ నవోదయ విద్యాసమితి ప్రిన్సిపాల్ చక్రపాణి, జిల్లా ఏసీజీఈ దామోదర్‌రావు పాల్గొన్నారు.

గమ్యంలోకి 'పల్లెవెలుగు'



బస్‌స్టేషన్‌లో నిలిపి ఉంచిన పల్లెవెలుగు బస్సులు

- ఆర్టీసీ బస్సుల్లో ట్రాకింగ్ సిస్టమ్ పూర్తి
- యాప్‌లో పక్కా సమాచారం
- అందుబాటులోకి తెచ్చిన సంస్థ

మంచిర్యాలఅర్బన్: సాంకేతికతను ఉపయోగించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో ఆర్టీసీ దూసుకెళ్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో ట్రాకింగ్ సదుపాయం ఉండగా.. ఇక పల్లెవెలుగుల్లోనూ పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చింది. అత్యాధునిక ఫీచర్లతో తీర్చిదిద్దిన బస్ ట్రాకింగ్ గమ్యం యాప్‌లో మారుమూల ప్రాంతాలకు వెళ్లే బస్సులు కూడా చేరాయి. గత ఏడాది ఆగస్టు 12న రాష్ట్ర వ్యాప్తంగా గమ్యం పేరుతో బస్సు ట్రాకింగ్‌యాప్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఇక నుంచి పల్లె వెలుగు బస్సుల్లో కూడా బస్సు ట్రాకింగ్ అందుబాటులోకి తెచ్చారు.

సులువుగా సమాచారం..

ఎక్కాల్సిన బస్సు ఎక్కడుందో తెలియక తికమకపడాల్సిన అవసరం లేదు. ఎప్పుడొస్తుందోననే కంగారు పడకుండా గమ్యం యాప్‌లో సమాచారం సులువుగా తెలుసుకోవచ్చు. మంచిర్యాల డిపోలో 148 బస్సులు ఉండగా.. ఇందులో 38 హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదివరకు ఈ బస్సుల్లో మాత్రమే ట్రాకింగ్ సౌకర్యం ఉండేది. ప్రస్తుతం మిగిలిన పల్లె వెలుగు బస్సుల్లో కూడా అమల్లోకి రానుంది. ప్రస్తుతం అద్దె బస్సు(పల్లె వెలుగు)ల్లో ట్రాకింగ్ సిస్టం కొనసాగుతోంది. వారంలోపు పూర్తి స్థాయిలో అన్ని బస్సుల్లోకి రానుంది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

టీఎస్‌ఆర్టీసీ గమ్యం పేరుతో యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది. టీఎస్ ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ www.tsrtc.telangana.gov.in నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రయాణికులు ఎలాంటి వ్యక్తిగత వివరాలు నమోదు చేయాల్సిన అవసరం ఉండదు. తెలుగు, ఇంగ్లిష్ భాషలో యాప్ అందుబాటులో ఉంది. 90శాతం మేర పల్లెవెలుగు బస్సుల్లో ట్రాకింగ్ సిస్టమ్ పూర్తయిందని, వారంలోపు అందుబాటులోకి రానుందని మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు.

గమ్యం యాప్ ద్వారా ఆరంభ స్థానం నుంచి గమ్యస్థానం వరకు ప్రయాణికులు ఏయే బస్సులు ఏయే సమయాల్లో అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో బస్సు సమాచారం మొత్తం ఉంటుంది.. గమ్యం చేరడానికి ఎన్ని ఎన్ని గంటలు పడుతుంది..? ఏ ప్రాంతంలో బస్సు ఉంది.. అందులో బస్సు డ్రైవర్ నంబర్, ఫోన్ నంబర్లు ఉంటాయి.

మహిళలకు భద్రత...

గమ్యం యాప్‌లో మహిళ భద్రతకు ప్రత్యేక ఫీచర్ ఏర్పాటు చేశారు. మహిళల ఇబ్బందులు తొలగించేలా ఫ్లాగ్ ఏ బస్సు ఫీచర్ ఉంది. రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం 6గంటల వరకు అందుబాటులో ఉంటుంది. మహిళ ప్రయాణికులు తమ వివరాలను యాప్‌లో నమోదు చేస్తే స్క్రీన్‌పై ఆకుపచ్చని లైట్ వస్తుంది. దీన్ని ఆ రూట్లో వచ్చే ఏ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు చూపినా వెంటనే నిలుపుతారు. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్



బ్యానర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీటీఓ

మంచిర్యాలఅగ్రికల్చర్: వాహనదారులు, పాదచారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమ, నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా రవాణా శాఖ అధికారి లెక్కల కిష్టయ్యతో కలిసి 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు–2024 బ్యానర్లు, వాల్‌పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల15 నుంచి ఫిబ్రవరి 14వరకు జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు రోడ్డు భద్రత నిబంధనలపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. మొబైల్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపరాదని తెలిపారు. ఆటోలు, జీపులు ఇతర ప్రైవేట్ రవాణా వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని తెలిపారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఫొటో ఓటరు జాబితా రుపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపులకు జిల్లాలో ఈ నెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2న అభ్యంతరాలు, ఫిర్యాదులు పరిష్కరించి, 8న తుది జాబితా ప్రచురణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుకు చర్యలు తీసుకోవాలని, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: పాలనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ ఉద్యోగుల(సివిల్ సర్వెంట్స్) నుంచి ప్రధానమంత్రి పురస్కారాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. బుధవారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదుల విభాగం సంయుక్త కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లాలోని సమీకృత కలెక్టరేట్ చాంబర్‌లో హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ కేటగిరీ–1లో 12 ప్రాధాన్యత రంగాల కింద ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి 10 అవార్డులు, కేటగిరీ–2,లో కేంద్ర, రాష్ట్ర, జిల్లాల వారీగా ఆవిష్కరణల విభాగాల ఉత్తమ సేవలు అందించిన వారికి 6 అవార్డులు అందిస్తామని తెలిపారు. ఈ నెల 31లోగా అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఐదు దశల్లో దరఖాస్తుల పరిశీలన తర్వాత పీఎం ఆమోదిస్తారని తెలిపారు.

బెల్లంపల్లి అభివృద్ధిపై సమీక్ష

- నేడు మున్సిపాల్టీలో సమావేశం
- హాజరు కానున్న ఎమ్మెల్యే, కలెక్టర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధి పనులపై గురువారం ఉదయం 11గంటలకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ నిర్వహిస్తున్న తొలి సమావేశానికి కలెక్టర్ సంతోష్ హాజరు కానుండడంతో ప్రాధాన్యత ఏర్పడింది. రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, పోలీసు, అటవీ, సింగరేణి, ప్లానింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, విద్యుత్, వైద్య, ఆరోగ్య తదితర 18శాఖల అధికారులను సమావేశానికి ఆహ్వానించారు.

వీటిపై దృష్టి సారించరూ..

- బెల్లంపల్లి పట్టణ ప్రజలకు గోదావరి జలాల సరఫరా నిలిచిపోయి ఏళ్లు గడుస్తోంది. ఎల్లంపల్లి–బెల్లంపల్లి గోదావరి నీటి పథకం, మందమర్రి, బెల్లంపల్లి మున్సిపాల్టీలకు సంయుక్తంగా మరో గోదావరి నీటి పథకం ఉన్నా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.
- బెల్లంపల్లిలో మినీట్యాంక్‌బండ్ నిర్మించినా ఎలాంటి ఉపయోగం లేదు. ఆహ్లాదకరమైన వాతావరణం, బోట్ సౌకర్యం కల్పించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో అలంకార ప్రాయంగా మారింది.
- బెల్లంపల్లి మున్సిపాల్టీ పరిధిలో బుధాకలాన్ సర్వే నంబరు 170లో ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు దురాక్రమణకు గురయ్యాయి. రూ.కోట్లు విలువ చేసే భూములను కబ్జా చేసి విక్రయాలు సాగిస్తున్నారు. స్థిరాస్తుల నిర్మాణం చేసి వ్యాపారం చేస్తున్నారు.
- బెల్లంపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. సబ్ డిపోనైనా మంజూరు చేయించి ప్రజల రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చాల్సి ఉంది.
- మ్యాంగో మార్కెట్ నిర్మించినా రైతులకు ఉపయోగపడడం లేదు. కొనుగోలుకు ట్రేడర్స్ ముందుకు రావడం రాలేదు.
- నెన్నెల, తాండూర్, వేమనపల్లి, కన్నెపల్లి, భీమిని తదితర మండలాల్లో పోడు భూముల సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. పలు చోట్ల అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదం కొనసాగుతోంది.
- వంద పడకల బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలి.
- బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలి.
- బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాలలో లాంగ్‌టర్మ్ కోచింగ్ సెంటర్‌కు అనుమతి మంజూరు చేయించాలి. సీఓఈ జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయించాలి.

రచయితలకు ఉచిత శిక్షణ

బెల్లంపల్లి: సినీ, టీవీ రంగాలపై ఆసక్తి ఉన్న ఔత్సాహికులు, రచయితలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు శిక్షణ శిబిరం చీఫ్ కో ఆర్డినేటర్ అభినవ సంతోష్‌కుమార్, జిల్లా సాంస్కృతిక సమాఖ్య జిల్లా నాయకుడు హన్మాండ్ల మధు తెలిపారు. స్థానికంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టరేట్‌లో ఈ నెల 20న శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ప్రముఖ సినీ, టీవీ దర్శకులు, రచయితలు హాజరవుతారని తెలిపారు. జిల్లా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులను రచయితలు, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాయకులు దినేష్, రాంచందర్, కళాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిటైర్డ్ కార్మికులకు చెల్లింపులు

శ్రీరాంపూర్: సింగరేణిలో రిటైర్డ్ అయిన కార్మికులకు లాభాల వాటా, దీపావళి బోనస్, వేతన ఒప్పంద ఏరియర్స్ చెల్లించనున్నట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న లాభాల వాటా, 21న దీపావళి బోనస్, ఫిబ్రవరి 6న 11వ వేతన ఒప్పందానికి సంబంధించిన ఏరియర్స్ నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బకాయిల చెల్లింపుపై హర్షం

మందమర్రిరూరల్: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు బకాయిల చెల్లింపునకు యాజమాన్యం అంగీకరించడంపై రిటైర్డ్ కార్మికులు వాసాల శంకర్, రాం రవీందర్, రేణికుంట్ల కొమురయ్య హర్షం వ్యక్తం చేశారు.

ఏఐటీయూసీ కృషి ఫలితంగానే చెల్లింపులు

కాసిపేట: ఏఐటీయూసీ కృషి ఫలితంగానే సింగరేణి యాజమాన్యం లాభాల వాటా, పీఎల్ఆర్ బోనస్, వేజ్‌బోర్డ్ ఏరియర్స్ చెల్లించేందుకు అంగీకరించిందని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం సోమగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ యాజమాన్యంతో మాట్లాడి ఒత్తిడి తెచ్చారన్నారు.

ప్రమోషన్ పత్రాలు అందజేత



పత్రాలు అందిస్తున్న ఏజెంట్ గోపాల్‌సింగ్

శ్రీరాంపూర్: ఎస్సార్పీ3, 3ఏ గనిలో పలువురు కార్మికులకు కేటగిరీ ప్రమోషన్ పత్రాలు అందజేశారు. బుధవారం గనిపై జరిగిన కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, మేనేజర్ సంతోశ్‌కుమార్ చేతులు మీదుగా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి శ్రీధర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు మురళీ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌గంగలో పడి వ్యక్తి మృతి



చంద్రశేఖర్(ఫైల్)

కౌటాల: పెన్‌గంగలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సిర్పూర్(టి) మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై బొజ్జిరావ్ తెలిపిన వివరాల మేరకు సిర్పూర్(టి)లోని బస్టాండ్ ప్రాంతానికి చెందిన దుర్గం చంద్రశేఖర్(45) కొంతకాలంగా కుటుంబ కలహాలతో మానసికంగా బాధపడుతున్నాడు. ఈనెల 12న ఇంటి నుంచి వెళ్లిన చంద్రశేఖర్ సిర్పూర్(టి) మండలం పెద్దబండలోని తన సోదరి ఇంటికి వచ్చాడు. గంట తర్వాత తన సోదరుడు రవికిరణ్ ఫోన్ చేసిన నేను వస్తున్నా అక్కడే ఉండాలని చెప్పగా అతని మాట వినకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు హుడ్కిలికి వెళ్తున్నానని స్థానికులకు చెప్పాడు. బుధవారం మండలంలోని వెంకట్రావ్‌పేట–పోడ్సా పెన్‌గంగలో మృతదేహం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య దుర్గం శ్రీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐఎస్ఎల్.. షురూ

ఉట్నూర్‌లోనే చదివా..



ఉట్నూర్ లాల్‌టెక్డీలోని ఏపీఆర్‌జేసీ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించా. క్రీడోత్సవాల్లో భాగంగా మళ్లీ ఇక్కడికి రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇంతకుముందు ఐఎస్ఎల్ క్రీడాపోటీలు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, సీబీ స్టేడియాల్లో నిర్వహించేవారు. కరోనా కారణంగా రెండేళ్లు పోటీలు నిలిపివేశాం. భద్రాచలం, ఉట్నూర్‌లో 7వ ఐఎస్ఎల్ క్రీడలు నిర్వహిస్తున్నాం. ఈ పోటీలు గురుకులాలకు ఒలింపిక్స్ లాంటివి.

– నర్సింహారెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్

గెలుపోటములు సహజమే



క్రీడల్లో గెలుపోటములు సహజమే. విద్యార్థులంతా కలిసికట్టుగా స్నేహ భావంతో క్రీడాపోటీల్లో పాల్గొనాలి. అన్ని సొసైటీల విద్యార్థులు కలిసి పోటీల్లో పాల్గొనడంతో విద్యార్థుల్లో స్నేహ భావం పెంపొందించుకునేందుకు ఆస్కారం ఉంది. ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– నవీన్ నికోలస్, ఈఎంఆర్ఎస్ సెక్రటరీ

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం



ఐఎస్ఎల్ క్రీడా పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవడం జరుగుతోంది. క్రీడలతో పాటు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు క్రీడల్లో అలసిపోకుండా ఉల్లాసంగా గడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– చాహత్ బాజ్‌పాయ్, ఉట్నూర్ ఐటీడీఏ పీవో

పాఠశాల రోజులు గుర్తుకొచ్చాయ్



గురుకుల పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు చూస్తుంటే నేను చిన్నతనంలో పాఠశాలలో చదువుకున్న రోజులు గుర్తుకు వచ్చాయి. క్రీడల్లో గెలుపోటములు సహజం. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని విజయకేతనం ఎగురవేయాలి.

– గౌస్ ఆలం, ఎస్పీ, ఆదిలాబాద్



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు



బెలూన్లను ఎగురవేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ 2023–24 రాష్ట్రస్థాయి ఐఎస్ఎల్ క్రీడాపోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంపీ సోయం బాపూరావు, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, మాజీ మంత్రి గోడం నగేశ్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఈఎంఆర్ఎస్ సెక్రటరీ నవీన్ నికోలస్, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ఏకలవ్య మోడల్ పాఠశాలలు, స్టార్, గిరిజన సంక్షేమ గురుకులాలు, ఆశ్రమాల విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ఒక్కో సొసైటీ నుంచి 219 మంది బాలురు, 193 మంది బాలికల చొప్పున మొత్తం 3,199 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అంతకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా ఏడు సొసైటీల నుంచి వచ్చిన విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. 200 మంది పీడీలు, రెఫరీలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

800 మీటర్ల పరుగుపందెం బాలురు విభాగంలో ఎంజేపీ సొసైటీకి చెందిన బసంత్ ప్రథమస్థానం, టీఎస్‌డబ్ల్యూఆర్‌కు చెందిన డి.సంతోశ్ ద్వితీయస్థానం, స్టార్స్ సొసైటీకి చెందిన సురేశ్ తృతీయస్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో టీడబ్ల్యూఆర్ఎస్ సొసైటీకి చెందిన ఆర్.కీర్తన ప్రథమస్థానం, బి.మధుప్రియ ద్వితీయస్థానం, టీడబ్ల్యూఆర్ఐఈఎస్‌కు చెందిన నందిని తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో పాటు ప్రశంసపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ జైవంత్‌రావు, డీడీ దిలీప్‌కుమార్, ఏఓ రాంబాబు, ఐటీడీఏ అధికారులు, గురుకులాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక నృత్యం చేస్తున్న విద్యార్థులు



క్రీడాకారులతో కలిసి ఆర్చరీ క్రీడలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రధాని మోదీ హయాంలో క్రీడలకు గుర్తింపు



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో దేశంలో క్రీడలకు గుర్తింపు లభించింది. ఒలింపిక్స్, ఏషియన్ క్రీడల్లో ప్రస్తుతం దేశం పతకాలను సాధిస్తుంది. 2016లో ఒలింపిక్స్‌లో నాలుగు పతకాలు, 2018లో ఏషియన్ గేమ్స్‌లో 8 పతకాలు, 2023 ఏషియన్ క్రీడల్లో 103 పతకాలు సాధించిన ఘనత మన దేశానికే చెందుతుంది. ఇదే స్ఫూర్తితో గ్రామీణ విద్యార్థులు సైతం క్రీడల్లో రాణించాలి.

– సోయం బాపూరావు, ఎంపీ

గురుకులంలోనే విద్యను అభ్యసించా..



నా చిన్నతనంలో నేనుకూడా గిరిజన గురుకులాల్లో విద్యను అభ్యసించా. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలి. ఇది వరకు ఉట్నూర్ ఐటీడీఏ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు భద్రాచలంలో జరిగిన క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్ సాధించడం అభినందనీయం. ఇలాగే క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి. గురుకులాల్లో నెలకొన్న సమస్యలు నాదృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తా.

– వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే, ఖానాపూర్

కోచ్‌గా విధులు నిర్వర్తించా..



క్రీడలు అంటే నాకెంతో ఇష్టం. హైదరాబాద్‌లో నేను కూడా కోచ్‌గా విధులు నిర్వర్తించా. ఇలాంటి క్రీడా మైదానాలు బోథ్ నియోజకవర్గంలో సైతం ఏర్పాటు చేసేందుకు అధికారులు కృషి చేయాలి. అక్కడి ప్రాంతం వారికి సైతం క్రీడలపై ఆసక్తి కలిగేలా ఐటీడీఏ పీవో దృష్టి సారించాలి. మాజీ ఎంపీ గోడం నగేశ్ బోథ్‌లో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం. విద్యార్థులు క్రీడల్లో రాణించాలి.

– అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

కొత్త బైక్ కోరిక తీరక ముందే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



అంజిత్ (ఫైల్)

బెల్లంపల్లి(తాండూర్): కొత్తగా కొనుగోలు చేసిన బైక్ మోజు తీరకముందే రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఆ యువకుడిని బలితీసుకున్న ఘటన తాండూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రేపల్లెవాడకు చెందిన కందుల అంజిత్ కుమార్ (20) మంచిర్యాల లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. కొన్నిరోజులుగా తండ్రి బాపురావును బైక్ కొనివ్వమని బలవంతం చేస్తుండడంతో ఇటీవల సోమవారం బైక్ కొనిచ్చాడు. మంగళవారం వాహనానికి పూజ చేయించారు. బుధవారం వ్యక్తిగత పనినిమిత్తం తాండూర్ ఐబీకి వెళ్తుండగా మార్గమధ్యలో జాతీయ రహదారిపై ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన మరో వాహనం ఢీ కొట్టింది. దీంతో వెనుక నుంచి వస్తున్న ఐచర్ వ్యాన్ కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విగతజీవిగా రోడ్డుపై పడి ఉన్న కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. బైక్ కొనిమ్మని బలవంత పెడ్తివి.. అంతలోనే మాకు దూరమయ్యావా అని గుండెలు బాదుకోవడం అక్కడ ఉన్న వారి హృదయాలను కలిచివేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నామినేషన్ పత్రాలు అందజేత

శ్రీరాంపూర్: ఈ నెల 28న జరుగనున్న సింగరేణి అధికారుల సంఘం(సీఎంఓఏఐ) ఎన్నికలకు సంబంధించి బుధవారం శ్రీరాంపూర్ నుంచి పలువురు అధికారులు జీఎం కాన్ఫరెన్స్‌హాల్‌లో నామినేషన్లు సమర్పించారు. కేంద్ర కమిటీ అధ్యక్ష పదవికి శ్రీరాంపూర్ నుంచి ఆర్కే 5 గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆర్కే 5 గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్ పోటీ పడుతుండగా జీఎం బి.సంజీవరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్ష పదవికి జగ్గారెడ్డి, కేవీ రెడ్డి, జనరల్ సెక్రెటరీకి మల్లయ్య, చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్, రాజారవిచరణ్, తిరుపతి, అమర్నాథ్, ట్రెజరర్‌గా రాము, పద్మ, జాయింట్ సెక్రెటరీగా భీమన్న, పాషాలు నామినేషన్లు సమర్పించారు. ఈ నెల 19 వరకు నామినేషన్ల ప్రక్రియ, 20, 21 తేదీల్లో విత్ డ్రాలు, 22న స్క్రూటీని, 23న ఫైనల్ లిస్టు, 28న ఎన్నికలు, అదే రోజు సాయంత్రం ఫలితాలు వెలువడనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

అధికారుల వైఖరిపై చిన్నారుల నిరసన



నిరసన తెలుపుతున్న చిన్నారులు

భీమారం: మండల కేంద్రంలోని పాత పోస్టాఫీస్ వీధిలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని బుధవారం స్థానిక చిన్నారులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటింటికీ విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు స్తంభం ఏర్పాటు చేసి దానికి ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. స్తంభానికి ఉన్న ఎర్త్ వైరుకు విద్యుతు సరఫరా అవుతుంది. రెండు రోజుల క్రితం ఎర్త్‌వైరుకు తగిలిన పిల్లి మృతి చెందింది. గొర్రెల మందకు కూడా షాక్ తగలడంతో జీవాలు కిందపడిపోయాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుగు ప్రయాణం పాట్లు..





సంక్రాంతికి సొంత ఊళ్లకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం కావడంతో మంచిర్యాల బస్‌స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బుధవారం సెలవులు ముగియడంతో బస్‌స్టేషన్‌లో ఎటూ చూసినా రద్దీగా మారింది. ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌కు వెళ్లే బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లతో సీట్లు నిండిపోయాయి. – మంచిర్యాలఅర్బన్

ఉరేసుకుని యువకుడు బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): క్షణికావేశంలో ఉరేసుకుని యువకుడు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం నంనూర్ పునరావాస కాలనీకి చెందిన ఉప్పులేటి సుధాకర్ కుమారుడు ఉప్పులేటి సాగర్(18) మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నెల రోజులుగా కళాశాలకు వెళ్లకపోవడంతో తండ్రి మందలించాడు. బుధవారం సుధాకర్ తన భార్యతో కలిసి మంచిర్యాలకు పనికి వెళ్లాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరేసుకోవడంతో మృతుని సోదరి అర్షిత గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏరియాలో ఇంజినీరింగ్ అధికారుల పర్యటన



పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీతో పాటు, గోలేటి సీహెచ్‌పీలో బుధవారం ఇంజినీరింగ్ అధికారులు పర్యటించారు. జీఎం (ఈఅండ్‌ఎం), (సీహెచ్‌పీ) నవీన్‌కుమార్ కైరిగూడ ఓసీపీలో కొత్తగా నిర్మిస్తున్న ఇన్‌ఫిట్ క్రషర్, కన్వేయర్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, ఎస్ఈ కేశవరావు, కైరిగూడ పీవో సత్యనారాయణ, ఫిట్ ఇంజినీర్లు వీరన్న, ఈఈ సివిల్ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో దొంగల హల్‌చల్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం దొంగలు హల్‌చల్ చేశారు. దుర్గయ్య అనే ప్రయాణికుడు పర్సునుండి రూ.4వేలు, రమేశ్ వద్ద నుంచి రూ.3 వేలు, మరో ప్రయాణికురాలి పర్సు దొంగిలించారు. బస్సు ఎక్కే ప్రయత్నంలో పర్సులు దొంగిలించబడ్డాయని బాధితులు వాపోయారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు. దొంగలను గుర్తించి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పిచ్చికుక్కల దాడిలో 15 మందికి గాయాలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బుధవారం సాయంత్రం పట్టణంలోని సంజీవయ్య కాలనీ, ఇందిరా మార్కెట్ ఏరియాల్లో దాదాపు 15 మందిపై దాడి చేసి గాయపర్చడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆయా కాలనీలకు చెందిన ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలు

- నేటి నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- 5 నుంచి ఇంటర్ మొదటి ఏడాది వరకు..
- లక్కీడ్రా ద్వారా సీట్ల కేటాయింపు

ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల వివరాలు

జిల్లా	పాఠశాల/కళాశాలలు
ఆదిలాబాద్	6
నిర్మల్	5
కుమురంభీం	3
మంచిర్యాల	3
మొత్తం	17

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు మైనార్టీ సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2024–25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించింది. ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. ఫిబ్రవరి 6వ తేదీతో గడువు ముగుస్తుంది. నాణ్యమైన విద్య, చక్కటి వసతి, భవితకు మార్గనిర్దేశనం చేసేలా ఏర్పాటు చేసిన మైనార్టీ గురుకులాల్లో బోధన అందిస్తుండగా, ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దీంతో ప్రతియేటా మైనార్టీ గురుకులాల్లో చేరికకు విద్యార్థుల నుంచి పోటీ ఎక్కువగానే ఉంటోంది. ఆంగ్ల మాధ్యమంలో బోధన సాగుతుండగా, విశాలమైన తరగతి గదులు, విద్యార్థులకు క్రీడలు, యోగ, అన్ని రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా చేయడం, సాయంత్రం వేళల్లో ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నారు.



మంచిర్యాల మైనార్టీ గురుకుల పాఠశాల

ఉమ్మడి జిల్లాలో 17 గురుకులాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 17 మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలు ఉండగా, అందులో 10 బాలురు, 7 బాలికల కళాశాలలు ఉన్నాయి. www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 5వ తరగతిలో 80 సీట్లు ఉండగా, మిగతా తరగతుల్లో ఉండే ఖాళీ సీట్ల ఆధారంగా కేటాయింపు చేస్తారు. లక్కీడ్రా ద్వారా సీట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను నేటి నుంచి స్వీకరిస్తున్నారు. నాణ్యమైన భోజనంతోపాటు ఉత్తమమైన విద్యను అందిస్తున్నాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి లక్కీడ్రా ద్వారా సీట్ల కేటాయిస్తాం.

– నీరటి రాజేశ్వరి, మంచిర్యాల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి

బోరు మోటార్లు మాయం

- జైపూర్‌లో వరుస చోరీల కలకలం

జైపూర్: జైపూర్‌లో బోరు మోటార్లు చోరీకి గురవుతున్నాయి. గుర్తు తెలియని దుండగులు బోర్లకు బిగించిన మోటార్లను టార్గెట్ చేసుకుని రాత్రికి రాత్రి ఎత్తుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. జైపూర్ మండల కేంద్రం నుంచి మంచిర్యాల–చెన్నూర్ 63వ జాతీయ రహదారి పక్కన నిర్మించుకుంటున్న ఇండ్లనే లక్ష్యంగా చేసుకున్నారు. రెండు రోజుల వ్యవధిలో మూడు మోటార్లు, వైర్లు, పైపులు మాయమయ్యాయి. దుండగులు ఎలాంటి అనుమానం రాకుండా బోరుపై భాగంలో మోటారు ఉన్నట్లుగా ఉంచి లోపలి మోటారు, వైరు, పైపులను ఎత్తుకెళ్తున్నారు. ఇటీవల వ్యవసాయ మోటార్లు సైతం మాయం అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాత్రి మోటారు పోయింది



జైపూర్ బస్టాండ్ సమీపంలో కొత్తగా ఇల్లు నిర్మించుకుంటున్నాం. రాత్రి 11 గంటల వరకు మోటారు ఉంది. ఉదయం వెళ్లి చూడగా మోటారు కనిపించడం లేదు. రూ.25 వేల విలువైన మోటారు, వైర్లు ఎత్తుకెళ్లారు.

– సాయిచరణ్, బాలాజీ హోటల్ నిర్వాహకుడు



బోరుపై భాగంలో కప్పు ఉంచి మోటారు మాయం చేసిన దుండగులు